

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శనివారం, 26 ఏప్రిల్ 2025

పీటలపై ఆగిన పెళ్లి

- కట్న కానుకలు ఎప్పుడిస్తారో తేల్చకపోవడమే కారణం
- పెద్ద మనుషుల జోక్యంతో నేడు వివాహ ఘట్టం

కూసుమంచి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఒప్పుకున్న కట్నకానుకల విషయంలో వధువు కుటుంబం ఏమీ తేల్చడం లేదంటూ వరుడి తరపువారు పీటలపైన పెళ్లిని నిలిపివేసిన ఉదంతం ఇది. ఖమ్మం జిల్లాలో శుక్రవారం ఈ ఘటన వెలుగు చూసింది. కూసుమంచి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని, అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన యువకుడికి ఇచ్చి వివాహం జరిపేందుకు ఇరు కుటుంబాల వారు నిర్ణయించుకున్నారు. రూ.5లక్షల నగదు, ఎకరం పొలం (రూ.30 లక్షల విలువ) కట్నకానుకలుగా ఇచ్చేందుకు (మిగతా 6వ పేజీలో)



దీపిక (ఫైల్)

క్షణికావేశం

- పురుగుల మందుతాగిన భర్త..
- అది చూసి సీసా లాక్కొని తానూ తాగిన భార్య
- చికిత్స పొందుతూ భార్య మృతి
- వరకట్న వేధింపులే కారణమని మృతురాలి తండ్రి ఫిర్యాదు

6



ఖమ్మంలో టీజీఈ జేఏసీ ఉద్యోగ సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ మారం జగదీశ్వర్

ఉద్యోగులపై అలక్ష్యం సరికాదు

- పార్టీల మేనిఫెస్టోలకే పరిమితమవుతున్న ఉద్యోగుల సమస్యలు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు
- తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్
- పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలి
- సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు
- నగరంలో ఉద్యోగ సదస్సు... భారీ ప్రదర్శన
- నినాదాలు చేస్తూ కదంతొక్కిన ఉద్యోగ లోకం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు రాజకీయ పార్టీల మేనిఫెస్టోలకే పరిమితం అవుతున్నాయని, అధికారంలోకి వచ్చాక పరిష్కారానికి నోచుకోవడం లేదని టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో శుక్రవారం రాత్రి సకల ఉద్యోగులు, సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జేఏసీ చైర్మన్ జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం మొదట్లోనే సెంబర్ స్టేట్మెంట్ పంపే ముందు ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను మినహాయించి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలని, ఉద్యోగుల సంక్షేమం బాగుంటేనే ఉద్యోగులు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో చురుగ్గా పాల్గొంటారని అన్నారు.

జేఏసీ కార్యాచరణ అంచెలంచెలుగా ప్రకటించడంలోనే ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఉద్దేశం ఉన్నదని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బుల్లో జీపీఎఫ్ లోన్ పెట్టుకుంటే రెండేళ్లయినా రావడంలేదని దీంతో ఉద్యోగ వర్గం తీవ్ర మనోవేదనకు గురవుతుందని అన్నారు. 30 రోజులు నిరంతరాయంగా పనిచేసే ఉద్యోగులు తమకు రావలసిన జీతాన్నే అడుగుతున్నారని అన్నారు. ప్రభుత్వం వచ్చి 16నెలలైనా ఇప్పటికీ మంత్రుల పేషీల్లో ఉద్యోగ సంఘ నాయకులని గుర్తించడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అలవెన్సుల చెల్లింపు, బకాయిలతో సహా 5డీఏల చెల్లింపు విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ భద్రతపై స్పష్టమైన విధానం రూపొందించాలని, వివిధ శాఖల్లో చెల్లింపు బాకీలున్న పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం టీజీఈ జేఏసీ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల సాధన కోసం మే 4న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని ఏలూరి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ మన్నెబోయిన తిరుపతి, ఖమ్మం జిల్లా టీజీఈ జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ సెక్రటరీ పారుపల్లి నాగేశ్వరరావు టీజీఈజేఏసీ రాష్ట్ర కో- చైర్మన్ దేవరకొండ సైదులు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరి సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మామునూరి రాజేష్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్, జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు

ర్యాలీలో ఉద్యోగ సంఘం నాయకులు

నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

హోరెత్తిన ఉద్యోగుల ప్రదర్శన

ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు కదం తొక్కారు. అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యమై టీజీఈ జేఏసీగా (తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ)గా ఏర్పాటయిన తర్వాత తొలిసారిగా ఖమ్మంలో పోరాటం ప్రారంభించారు. టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కలెక్టరేట్ వద్ద ప్రదర్శనను రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. మోటారు సైకిళ్లతో కలెక్టరేట్ నుంచి శ్రీశ్రీసర్కిల్, వైరా రోడ్డు మీదుగా ఖమ్మం టీఎన్జీవో ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, వై వెంకటేశ్వరావు, కొణిదెన శ్రీనివాస్, మల్లెల రవీంద్రప్రసాద్, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ర్యాలీ దృశ్యం



మాదాల రవి

నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న వీపీ సాను

నయా ఫాసిస్టు విధానాలపై పోరాటం

- బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే విద్యార్థి నేతలపై అక్రమ కేసులు
- హిందు, హిందూస్థానీ అంటూ పాఠ్యపుస్తకాల్లో మార్పులు
- భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ భవిష్యత్ కోసం పనిచేయాలి
- ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి వీపీ సాను, అభ్యుదయవాది మాదాల రవి
- ఖమ్మంలో ఘనంగా ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు
- నగరంలో భారీ ర్యాలీ... కదం తొక్కిన విద్యార్థులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను కాషాయీకరణ చేస్తూ, నయా ఫాసిస్టు విధానాలకు బీజం వేస్తోందని ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి వీపీ సాను, అభ్యుదయ వాది, సినీ నటుడు మాదాల రవి విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు శుక్రవారం ఖమ్మం లోని భక్తరామదాసు కళాక్షేత్రం (సీతారాం ఏచూరి నగర్)లో ప్రారంభమయ్యాయి. ఈ సభలకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యదర్శి వీపీ సాను మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు కేంద్ర ప్రభుత్వ భద్రతా లోపమే కారణమన్నారు. పార్లమెంట్‌పై దాడులు మొదలు, పుల్వామా వరకు అనేక చోట్ల ఉగ్రదాడులు జరుగుతున్నాయని, ప్రధానిగా మోదీ, రక్షణ మంత్రిగా అమిత్ షాకు కొనసాగే అర్హత లేదన్నారు. బీజేపీకి, నరేంద్రమోదీకి వ్యతిరేకంగా మాట్లాడారని యూనివర్సిటీ విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సీయూ భూములను ప్రభుత్వాలు కొల్లగొడుతున్నాయన్నారు. విద్యా సమస్యలపై ప్రశ్నించిన నాయకులపై దేశద్రోహం కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కశ్మీర్ ప్రజలపై ఆర్ఎస్ఎస్, హిందుత్వ, మతోన్మాదశక్తులు దాడి చేస్తున్నాయన్నారు.

అభ్యుదయవాది, సినీ నటుడు మాదాల రవి మాట్లాడుతూ విద్యా సమస్యలపై పోరాటాలే ఏకైక మార్గమని, వామపక్షాలు (మిగతా 6వ పేజీలో)

కేసులు.. తిరకాసులు..

ఎర్రుపాలెం మండలంలో ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు ఆమెను గర్భవతిని చేసి మోసానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక స్థానిక పోలీసులను ఆశ్రయించగా, వారు రోజుల తరబడి తాత్సారం చేశారు. తర్వాత బాలిక పోలీసు ఉన్నతాధికారులను కలిసినప్పటికీ స్థానిక అధికారి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో మనస్తాపం చెందిన బాలిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని వాటర్‌ట్యాంకు ఎక్కి, ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో మరుసటిరోజు సదరు యువకుడిపై పోలీసులు 'పోక్సో' కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి నెలరోజులు దాటిపోయింది. కానీ స్థానిక పోలీసు అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఖమ్మం నగరంలో ఇంటి నెంబర్లకు సంబంధించి దొంగ అసెస్‌మెంట్లు వేశారన్న అంశంపై 2023 ఆగస్టులో 8మందిపై టు టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి విచారణ ఏడాదిన్నరపాటు సాగించారు. కాగా ఈ కేసుల్లో ఓ ఎఫ్ఐఆర్‌కు సంబంధించి ఆరుగురిపై చార్జిషీటు ఫైల్ చేసిన అధికారులు... మరో ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి మాత్రం ఒకరిపై మాత్రమే చార్జిషీటు దాఖలు చేశారు. ఇదే స్టేషన్ పరిధిలో మునిసిపల్ కార్పొరేషన్‌లో ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడగా.. కార్యాలయంలోని పలువురు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. కానీ ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు.

ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే... అంతేకాదు ఆయా కేసులన్నీ పెద్ద ఎత్తున చర్చ జరిగిన అంశాలే. ఇలాంటి కేసుల్లోనే పోలీసు అధికారులు ఇంతటిస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే.. ఇక చిన్నా చితక కేసుల్లో బాధితుల పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారుతోంది.



- పలు కేసుల్లో పోలీసు అధికారుల ఉద్దేశపూర్వక జాప్యం
- నమోదు నుంచి చార్జిషీట్ల వరకు నిర్లక్ష్యం
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో కేసులు
- రాజకీయ ఒత్తిళ్లూ కారణాలే...
- నిందితులకు సత్వర శిక్ష పడటంలో జాప్యం

ఖమ్మం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'బాధితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ప్రతి చిన్న ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నాం. ఫలితంగానే ఖమ్మం కమిషనరేట్ పరిధిలో కేసుల నమోదు సంఖ్య పెరిగింది.' ఇవి గతేడాది క్రైం వార్షిక నివేదికలో పోలీసు ఉన్నతాధికారులు చెప్పిన మాటలు. అంతేకాదు ఆయా ఉన్నతాధికారులు ప్రతీ క్రైం రివ్యూలోనూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని, కోర్టుల్లో శిక్ష పడేలా విచారణ సాగించాలని పదే పదే చెబుతూ ఉన్నారు. కానీ కొందరు అధికారులు మాత్రం ఉన్నతాధికారుల మాటలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో వందల మంది పదుల కొద్దీ కేసులు నమోదవుతున్నప్పటికీ నిందితులు మాత్రం దర్జాగా రోడ్లపైన తిరుగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే నిజంగా పోలీసుల విచారణలో ఆలస్యం జరుగుతోందా? లేక పోలీసులే ఆయా కేసులను పట్టించుకోకుండా వదిలేస్తున్నారా? వంటి ప్రశ్నలు బోలెడన్ని. ఒకటి రెండు కేసులు మినహా మిగిలిన కేసుల్లో పోలీసులే కేసులను నీరుగార్చే రీతిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..

అధికారుల నిర్లక్ష్యం, లాలూచీ వ్యవహారాల కారణంగా ఏళ్లతరబడి కేసులు పెండింగ్‌లోనే ఉంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సందర్భంలో కేసులు నమోదు చేయకుండా రోజుల తరబడి తిప్పుకోవడం.. ఎవరైనా ఉన్నతాధికారుల వద్దకు వెళ్తానని చెప్పిన సందర్భంలో ఎఫ్ఐఆర్ (మిగతా 6వ పేజీలో)

ఆటలకు వేళాయే..

- డీఎస్ఏ ఆధ్వర్యంలో జిల్లాలో 55 వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటు
- ఒక్కో శిబిరానికి రూ.6వేలు కేటాయింపు
- మే 1 నుంచి 31వరకు శిబిరాల నిర్వహణ
- అందుబాటులో ఎన్నెన్నో ఆటలు
- ఉచితంగా క్రీడా పరికరాలు
- వేసవి సెలవులను వృథా చేయొద్దు: డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి



ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను తీర్చిదిద్దడానికి, వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయి. ఇప్పటి వరకు ఏ ఆట నేర్చుకోని వారికి సమ్మర్ క్యాంపులు వరం లాంటివి. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నగరంలో 22, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 23 శిబిరాలను ఏర్పాటు చేసింది. ఒక్కో శిక్షణ శిబిరానికి రూ.6వేలు కేటాయించింది. అందులో రూ.5వేలు కోచ్‌కు గౌరవ వేతనం, తాగునీటి వసతికి రూ. వెయ్యి కేటాయించారు. శిక్షణకు వచ్చిన వారికి క్రీడాపరికరాలు, కిట్లు ఉచితంగా ఇవ్వనున్నారు. మే 31వ తేదీ వరకు క్యాంపులు నిర్వహిస్తుండగా, ఆటలు సాఫీగా సాగేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఏదైనా ఒక క్రీడను తప్పనిసరిగా నేర్చుకోవాలని, (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

బీఆర్ఎస్ సత్తా చూపిస్తాం...

- వరంగల్‌లో రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

వివరాలు : 6లో



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

శివాలయ మాన్యం సర్వే

» పోలీస్ బందోబస్తు నడుమ సర్వే » హద్దుల గుర్తింపు

జూలూరుపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాపకొల్లు శ్రీఉమా సోమలింగేశ్వరస్వామి ఆలయ (దేవుడి) మాన్యానికి సంబంధించిన భూమిని శుక్రవారం పోలీస్ బందోబస్తు నడుమ ఎండోమెంట్ అధికారుల సమక్షంలో సర్వే చేశారు. మండలంలోని గుండ్లరేవు, రాంపురం గ్రామాల సరిహద్దులో 10-16 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. కాగా సర్వే నెంబర్ 1050లో 4 ఎకరాలు, 1051లో 6-16 ఎకరాల దేవుడి మాన్యం ఉండగా.. దీనిలో కొంత భూమి ఆక్రమణకు గురైంది. దీంతో రెండు సర్వే నెంబర్లలోని భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ బాదావత్ రవి తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బెల్‌సింగ్, దేవాదాయ శాఖ సర్వే అనిల్ కుమార్, రెవెన్యూ సర్వే ప్రవీణ్, ఆయన ఈవో వెంకట్రావ్, ఎస్ఐ బాదావత్ రవి, కల్లూరు, నాచారం, అన్నపురెడ్డిపల్లి ఆలయాల ఈవోలు సూర్యప్రకాశ్‌రావు, శేషయ్య, వెంకటరమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొడుమూరి కోటేశ్వరరావు, నవీన్ రాథోడ్, అమూ తదితరులు పాల్గొన్నారు.

దళిత చైతన్యానికి దిక్సూచి అంబేద్కర్

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దళిత చైతన్యానికి నూతన దిక్సూచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆయన ఆశయసాధనకై బీజేపీ ప్రయాణం చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గమూ దేశభవిష్యత్‌కు మార్గదర్శకమని, అంబేద్కర్ ఆలోచనలు నేటి భారత శాసనవ్యవస్థకు ప్రాణమన్నారు. బీజేపీకి అంబేద్కర్ ఆశయాలపై అమిత గౌరవం ఉందని నేటికి వారిస్మృతులను అభివృద్ధి చేస్తూ ప్రపంచానికి ఆయన గొప్పతనం చాటుతున్నామన్నారు. బీజేపీ దళితులను కేవలం ఓట్లు అడిగే పార్టీ కాదని, వారి జీవించేందుకు అవకాశాలు కలిపించే పార్టీ అని, అంబేద్కర్ కలల సమాజం కోసం బీజేపీ విధేయతతో కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుదర్శన్, నంబూరి రామలింగేశ్వరరావు, రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, రవిరాథోడ్, సుబ్బారావు, బెనర్జీ, రాజేష్, మంద సరస్వతి, ఏలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల కోసం '1962' సేవలు

» ఫోన్ చేయగానే గ్రామాల్లోకి 'అంబా'లెన్స్‌లు
» ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి జిల్లాలో ఐదు వాహనాలు
» నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం



ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మనుషులకు అత్యవసర సేవలు అందాలంటే.. 108కు ఫోన్ చేస్తే ప్రభుత్వ అంబులెన్స్ కుయ్.. కుయ్‌మంటూ వస్తుంది. అదే తరహాలో పశువులకు సత్వర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే సంచార వైద్యశాల వాహనం గ్రామాలకు వస్తుంది. అందులోని పశువైద్య సిబ్బంది పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్సచేసి, రైతులు, పెంపకందారులకు మందులు ఇచ్చి వెళతారు. ఈ సంచార వైద్యశాల (అంబులెన్స్) వాహనాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సేవలందిస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు మెరుగైన వైద్యం అందించడమే వీటి లక్ష్యం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున రెండు జిల్లాల పరిధిలో 10 వాహనాలు అందుబాటులో ఉన్నా యి. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని జరుపుకొంటారు. దీని ప్రకారం ఈనెల 26న పశువైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

రెండు జిల్లాలో పశుసంపద ఇలా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 80 పశువైద్యశాలలు ఉండగా.. 44 గ్రామీణ పశు వైద్యశాలలు, 30 ప్రాథమిక పశువైద్యశాలలు, 6 గ్రేడ్ 1 స్థాయి పశువైద్యశాలలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 14,67,126 పశువులు ఉన్నాయి. గేదెలు 1,92,376, గొర్రెలు 1,04,288, మేకలు 2,25,171, కోళ్ల 7,12,546 ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో జిల్లా వెటర్నరీ వైద్యశాల 1, ఏరియా ఆస్పత్రులు 3, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47, సబ్ సెంటర్లు (ఎనిమల్ హెల్త్) 90ఉన్నాయి. తెల్లపశువులు మొత్తం 1,41,117, గేదెలు 3,75,103, గొర్రెలు 6,67,318, మేకలు 1,90,013 ఉన్నాయి. వీటికి ఏదైనా జబ్బు సోకినా, అత్యవసర వైద్యం కావాల్సి వచ్చినా.. 1962కు ఫోన్ చేస్తే పశువైద్యసేవల అంబులెన్స్ ఆ ఊరికి వస్తుంది. ప్రతీ నియోజకవర్గానికి ఒక వెటర్నరీ అంబులెన్సును కేటాయించారు. దీని ప్రకారం భద్రాద్రి జిల్లాలో 5, ఖమ్మం జిల్లాలో 5 వాహనాలు ఉన్నాయి.

పశువులకు వైద్యం అందేదెలా...?

పశువులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. వైద్యులు, సిబ్బంది, మందుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో చికిత్స అందడం లేదు. అత్యవసర సమయాల్లో అందజేయాల్సిన మందులు లేక ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కేవలం నట్టల నివారణ మందులు మినహా ఇతర వైద్య సేవలు దాదాపుగా అందుబాటులో లేవని రైతులు తెలిపారు. వైద్యశాలల్లో సౌకర్యాలు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రైతులకు ఎంతో మేలు..

కె.వెంకటనారాయణ, జిల్లా పశు వైద్య, పశు సంవర్థక శాఖ అధికారి



పశు సంచార వైద్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వాహనాలు కేటాయించింది. 1962 నెంబరుకు ఫోన్ చేస్తే అన్ని పనిదినాలలో నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉంటారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయి. రైతులు ఫోన్ చేయగానే పశువైద్య సిబ్బంది వారి ఊరికి వెళ్లి మూగ జీవాలకు చికిత్స అందిస్తారు. ఆర్థిక వెసులుబాటు లేనివారికి ఉపయోగం. మారుమూల ప్రాంతాల్లో కూడా పశువైద్యసేవలు అందుతాయి. పశువుల వద్దకే వైద్యం రావడం మంచి పరిణామం.

28న రాష్ట్ర జూనియర్ కబడ్డీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియం లో తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బండ్ల రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపికచేసి త్వరలో నాగపూర్‌లో అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 25సంవత్సరాల లోపు ఉండాలని, ఆసక్తి గల క్రీడాకారులు తమ, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

నేడు 'మమత'లో గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మమత వైద్య, దంత, నర్సింగ్ కాలేజీల సంయుక్త గ్రాడ్యుయేషన్ డే శనివారం నిర్వహించనున్నట్టు సెక్రటరీ పువ్వాడ జయశ్రీ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ నారాయణరావు, యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్ (కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం) వైస్ ఛాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి, విశిష్ట అతిథిగా పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. పువ్వాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్స్ అన్ని శాఖల విభాగాధిపతులు, పాల్గొంటారని తెలిపారు.

కాపునకు రాని మొక్కలు పరిశీలించిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్



తోటలను పరిశీలిస్తున్న చైర్మన్ జంగా రాఘవరెడ్డి

దమ్మపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జగ్గారం గ్రామంలో కాపునకు రాని పామాయిల్ మొక్కలను ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. గిరిజన రైతు కారం శ్రీరాములుకు చెందిన పామాయిల్ తోటను ఆయన సందర్శించారు. పామాయిల్ కాపు రాని చెట్లు ఎక్కువగా ఉన్నాయిని దీని వల్ల తాము నష్టపోయామని పరిశీలించి న్యాయం చేయాలని చైర్మన్‌ను కోరారు. పక్కనే ఉన్న తోటలో గోద్రేజ్ కంపెనీకి చెందిన పామాయిల్ మొక్కలు నాటగా ఎక్కడా నాశిరకం మొక్కలు రాలేదని, కేవలం ఆయిల్‌ఫెడ్ ఇచ్చిన మొక్కలలోనే కాపు రాని మొక్కలు ఉన్నాయని ఆయిల్‌ఫెడ్ తప్పిదం వల్ల రైతులకు నష్టం జరిగిందని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ రైతులతో మాట్లాడుతూ కాపు రాని మొక్కల వల్ల రైతులకు నష్టం జరిగిందని వివరాలు సేకరించేందుకు తోటలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాపు రాని మొక్కలు ఉంటే వాటిని తొలగించి కొత్త మొక్కలు వేసుకోవాలని వాటి స్థానంలో పామాయిల్ మొక్కలు ఇవ్వటం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. దీంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. పామాయిల్ తోటలు పరిశీలించిన వారిలో సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ రాధాకృష్ణ, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది, పామాయిల్ సంఘం నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, సూరిబాబు, ఫుల్లయ్య గిరిజన రైతులు ఉన్నారు.

క్రీడా స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించండి

ఐటీడీఏ పీవో బి.రాహుల్



భూమిని పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఏప్రిల్ 25: భద్రాచలంలోని సుందరయ్యనగర్‌లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిలో క్రీడాకారుల కోసం స్టేడియం నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో శుక్రవారం డీఆర్‌సీ పక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ భద్రాచలంలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతీ యువకులు చాలా మంది ఉన్నారని, వారు క్రీడా ప్రాంగణాలు లేక నిరుత్సాహానికి గురవుతున్నారన్నారు. క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని మినీ స్టేడియం నిర్మాణానికి రెవెన్యూ శాఖ ద్వార భూమి వివరాలను సేకరించి స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే సుందరయ్యనగర్‌లో ఇందిరమ్మ కాలనీ సందర్శించి సొంత భూమి ఉండి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకుంటే ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో ఉన్న ఆదివాసీ గిరిజన మహనీయుల విగ్రహాలకు ఏమైనా మరమ్మతులు ఉంటే దానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమం లో డీఈ హరీష్, తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

ఆటలకు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.

చెస్, షూటింగ్ లేనట్లే..

ఈ ఏడాది డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలల్లో ఆటల జాబితాను శుక్రవారం నుంచి జిల్లా అధికారులకు పంపారు. దానిలో రైఫిల్ షూటింగ్, చదరంగం క్రీడాంశాలు లేకపోవడంతో క్రీడాకారులు కొంత నిరాశ చెందుతున్నారు. ఆయా క్రీడాంశాలు రెండూ ఎండ వేడిమితో సంబంధం లేకుండా ఇండోర్‌లో ఆడే క్రీడలే కావడం విశేషం. ఆయా రెండు క్రీడలకు గతేడాది క్రీడాకారులు తక్కువగా రావడంతో ఈ ఏడాది నిలిపి వేసినట్లు అధికారులు చెబుతున్నారు.

నగరంలోని శిబిరాలు ఇవే...


నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్ (ఎస్సీ స్టేడియం, పెవిలియన్‌గ్రౌండ్, సెయింట్ జోసఫ్ మూడు కేంద్రాలు), క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్ స్కేటింగ్, ఉషూ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, టేబుల్‌టెన్నిస్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖో-ఖో, నెట్‌బాల్, కరాటే, సెల్ఫ్ డిఫెన్స్(పెవిలియన్ గ్రౌండ్)

గ్రామాల్లో ఇలా...

జిల్లాలోని కల్లూరు మినీ స్టేడియంలో బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, వైరా ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, లాన్‌టెన్నిస్ మధిరలో కబడ్డీ, షటిల్, తనికెళ్లలో కబడ్డీ, మల్లెమడుగు, పీపీ పాలెం, కుంచపర్తిలలో ఫుట్‌బాల్, బోనకల్‌లో బాల్‌బ్యాడ్మింట్, ఎంపీ పాలెం, మంచుకొండ, కొత్తలింగాల, గుదిమళ్ల, ముదిగొండలలో వాలీబాల్, పాండురంగాపురం, బచ్చోడు, వెంకటగిరిల, కొడుమూరులలో హ్యాండ్‌బాల్ తిమ్మరావుపేటలో కబడ్డీ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు.

నిపుణులైన కోచ్‌ల నియామకం

సునీల్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి



మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. శిబిరాల్లో ఉచితంగా క్రీడా పరికరాలతో పాటు నిపుణులైన కోచ్‌లను నియమించాం. శిబిరాలను రోజు వారీగా శిక్షణకు వచ్చే విద్యార్థులతో పాటు కొత్తవారు కూడా రావాలి. క్రీడాకారులకు వేసవి తాపం నుంచి రక్షించే తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావకాలను అందించేందుకు దాతలు ముందుకు రావాలి. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా శిక్షణా కేంద్రాలకు కేటాయించిన కోచ్‌లను సంప్రదించాలి.

పీటలపై ఆగిన పెళ్లి

(5వ పేజీ తరువాయి)

ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేర కు గురువారం ముహూర్తం నిర్ణయించుకొని జగ్గయ్యపేట సమీపంలోని ఓ ఆలయంలో పెళ్లి వేడుక జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే పెళ్లి రోజు వరకు కూడా కట్నకానుకలు ఎప్పుడిస్తారో తేల్చకపోవడంతో గొడవ మొదలైంది. దీంతో గురువారం మరికొద్దిసేపట్లో పెళ్లి జరుగుతుందనగా... ఒప్పుకున్న కట్నకానుకలు ఎప్పుడిస్తారో చెప్పాలని, ఆ మేరకు అగ్రిమెంట్ ఇవ్వాలని వరుడితోపాటు అతడి తరఫువారు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదన మొదలైంది. మాటామాటా పెరగడంతో పెళ్లి చేసుకునేది లేదని వరుడు భీష్మించుకు కూర్చున్నాడు.

దీంతో వధువు కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో ఇరు కుటుంబాల పెద్దలు శుక్రవారం సమావేశమై సమస్యను పరిష్కరించారు. ఆగిపోయిన పెళ్లిని శనివారం కూసుమంచి మం డలంలోని ఓ గ్రామంలో గల ఆలయంలో జరిపేందుకు ము హూర్తం ఖరారు చేశారు. వరుడు బీటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, వధువు టెన్త్ వరకు చదివింది. ఇరు కుటుంబాల వారు దగ్గరి బంధువులు కావడం గమనార్హం.

కేసులు.. తిరకాసులు..

(5వ పేజీ తరువాయి)

నమోదు చేసి పక్కన పడేయడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే నిందితులతో లాలూచీ వ్యవహారాలు సాగిస్తున్న కొందరు అధికారులు.. నిందితుల కోసం వెళ్లిన బాధితులకు చెప్పే సమాధానాలు, ఉన్నతాధికారులకు ఇచ్చే నివేదికలు కేసులను పక్కదారి పట్టించేలా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరికొన్ని కేసుల్లో రిపోర్టుల పేరుతో కాలయాపన చేస్తున్నట్టుగా కూడా తెలుస్తోంది. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నుంచి రిపోర్టులు రావాలని కొన్ని కేసులు, ఇతర శాఖలతో ఉన్న కేసుల్లో ఆయా శాఖల నుంచి నివేదికలు రావాలని ఇంకొన్ని కేసులు హోల్డ్‌లో ఉంచుతున్నట్టుగా తెలుస్తోంది. ఉన్నతాధికారులు అడిగినప్పటికీ ఆయా రిపోర్టుల అంశాన్నే ప్రధానాస్త్రంగా వాడుతున్నట్టు వినికిడి. ఉదాహరణకు కార్పొరేషన్ పరిధిలోని దొంగ అసెస్‌మెంట్లకు సంబంధించి ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో మరో వ్యక్తి దొరకలేదంటూ చూపించడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వాస్తవానికి అసెస్‌మెంట్లకు సంబంధించి ఆధార్‌కార్డు కచ్చితంగా అప్‌లోడ్ చేస్తారు. దాని ఆధారంగానే గతంలో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు.

మరికొన్ని కేసుల్లో ఇలా...

కొన్ని కేసుల్లో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తించే అధికారి బాధ్యత తీసుకుని కేసును ఛేదించే ప్రయత్నాలు చేయడం మొదలు.. అందులో ఎవరెవరు నిందితులు ఉన్నారు వంటి విచారణ పూర్తి చేసిన అనంతరం అందులో ఉన్న నిందితుల్లో ఒకరిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం వరకు బాగానే సాగుతోంది. అయితే ఆ తర్వాత కేసుకు సంబంధించిన నిందితుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్న వాదన వినిపి స్తోంది. అయితే ఇలాంటి కేసుల్లో కొన్నిసార్లు అధికారులు బదిలీ అయిన సందర్భాలు ఉంటున్నాయన్న చర్చ జరుగుతోంది. ఆ తర్వాత సంబంధిత స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా వచ్చే అధికారులు వాటిని పూర్తిగా మూలకు నెట్టేస్తున్నారన్న వాదన లేకపోలేదు. పలు కేసుల్లో రాజకీయ జోక్యం ఎక్కువ అవుతున్న సందర్భాలు కారణాలుగా కనిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసే పోలీసు అధికారులు.. కొద్ది రోజులకు ఆ హడావిడి తగ్గిపోతుండటంతో ఆయా కేసులను పక్కన పెట్టేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకొన్ని కేసుల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోవడమూ ఓ కారణంగానే కనిపిస్తోంది. తమకు సంబంధించిన వ్యక్తిని బయట ఉంచేందుకు పలువురు రాజకీయ నేతలు పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి పరారీ అస్త్రాన్ని వాడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఈ తరహా కేసులు అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్నట్టుగా చర్చ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల బాధితులకు వీటిపై అవగాహన లేకపోవడంతో మొదటిసారి నిందితుడిని స్టేషన్‌కు తీసుకొచ్చే వరకే పట్టించుకుంటున్నారనీ.. ఆ తర్వాత ఒకరిద్దరు మినహా తమ కేసులు ఏమయ్యాయో అని పట్టించుకోకపోవడం కొందరు పోలీసులకు కలిసొచ్చే అవకాశంగా కనిపిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందనీ, ఫలితంగా కొన్ని పోలీస్ స్టేషన్లలో అవుట్ స్టాండింగ్ కేసులు పదుల సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది.



ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ ప్రదర్శన

నయా ఫాసిస్టు విధానాలపై పోరాటం

(5వ పేజీ తరువాయి)

ఏకం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. దేశానికి విముక్తి కలిగించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ భవిష్యత్ కోసం పని చేయాలన్నారు. ఎర్రమల్లెలు పూయించిన మాదాల రంగారావు.. ప్రజానాట్య మండలి నుంచి పుట్టిన బిడ్డ అని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆధ్వర్యంలో గరికపాటి మోహన్‌రావు నిర్మించిన పుట్టిల్లు సినిమా ఈ కోవలోనిదే అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, విద్యావేత్తలు ముప్పా శ్రీనివాసరావు, రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ ఎం.పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ

రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు జడ్పీ సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. గిరిజన నృత్యాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది.

క్షణికావేశం...

» పురుగుల మందుతాగిన భర్త..
» అది చూసి సీసా లాక్కొని తానూ తాగిన భార్య
» భార్య మృతి.. భర్త పరిస్థితి ఆందోళనకరం

టేకులపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు.. ఎన్నో ఆశలతో ఆమె మెట్టినింట కాలుమోపింది. కానీ కొన్ని నెలలకే ఆమెకు వరకట్నం వేధింపులు మొదలయ్యాయి.

నిత్యం గొడవలు జరుగుతున్న క్రమంలో భర్త క్రిమిసంహారక మందు తాగగా, అది చూసి భార్య కూడా అతడి నుంచి సీసా లాక్కొని తానూ తాగింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్త చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని వెంకట్యాతండాలో శుక్రవారం ఈ విషాద ఘటన జరిగింది. టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం.. టేకులపల్లి మండలంలోని రేగులతండాకు చెందిన ఇస్లావత్ సత్యాల్ కుమార్తె దీపిక (19)కు వెంకట్యాతండాకు చెందిన బోడ శ్రీనుతో ఆరునెలల క్రితం ప్రేమవివాహం జరిగింది. గత రెండు నెలలుగా ఆమె భర్త బోడ శ్రీను, అత్త, మామలు, ఆడబిడ్డలు కట్నం తీసుకు రావాలని ఆమెను వేధిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం వారందరూ దీపికతో గొడవపడ్డారు.

అయితే ఘర్షణ జరుగుతున్న క్రమంలో క్షణికావేశానికి లోనైన శ్రీను.. మజాలో కలిపిన క్రిమిసంహారక మందును తాగాడు. ఇది గమనించిన దీపిక కూడా ఆ సీసా లాక్కొని తానూ తాగింది. దీంతో కుటుంబ సభ్యులు దీపిక, శ్రీనును ఖమ్మం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా దీపిక మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. కాగా, దీపిక రెండునెలల గర్భిణి.

బీఆర్ఎస్ సత్తా చూపిస్తాం..

ఖమ్మం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ఆవిర్భవించి 25ఏళ్లు అయిన నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న రజతోత్సవ సభను సక్సెస్ చేసి బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు.

ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన నాటి టీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ సారథ్యంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, 24 ఏళ్ల పూర్తి చేసుకుంటోందని, ఆదివారం 25వ ఏట అడుగుపెట్టబోతున్న సందర్భంగా సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ప్రజలు హాజరుకాబోతున్నారన్నారు. ఇందుకు నియోజకవర్గాల వారీగా వాహనాలను సమకూర్చడం జరిగిందని ఒక్క ఖమ్మం జిల్లా నుంచే 40వేల మందిపైగా జనసమీకరణ చేస్తున్నామని వివరించారు.

గుప్పెడు మంది తెలంగాణ ఉద్యమకారులతో రాష్ట్రసాధన ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్ గాంధీమార్గంలో ముందుకు సాగారని, అనేక పోరాటాలతో రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులుతీస్తే కాంగ్రెస్ పాలనలో తిరోగమనం చెందుతుందన్నారు. మోసపూరిత హామీలు, వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 16 నెలల పాలనలో కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం కూడా సంతృప్తిగా లేదన్నారు. ప్రజలు వరంగల్ సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని, రాజకీయ వివక్షతతో కొన్నిచోట్ల రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. గోనె సంచులను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించారని, కాంగ్రెస్ పార్టీ నాయకులే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నడుపుతున్నారని, గ్రామాల్లో బీఆర్ఎస్ రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులున్నా జిల్లాలో ధాన్యం కొనుగోలుపై ఒక్కరు కూడా సమీక్ష చేయడం లేదని, క్రమశిక్షణ పద్ధతి లేకుండా ధాన్యం కొనుగోళ్లు ఇష్టానుసారంగా నడుస్తున్నాయని, తారం కూడా అధికంగా తీస్తున్నారని ఆరోపించారు.

ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రావతి, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ జడ్పీటీసీ వరప్రసాద్, బీఆర్ఎస్ ఖమ్మం ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మగ్బుల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, న్యాయవాది తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి మౌనం పాటించి ఉగ్రవాదుల హింసాత్మక చర్యలను ఖండించారు.

మలేరియా నియంత్రణ.. ప్రతీ ఒక్కరి బాధ్యత

కొత్తగూడెం, పోస్టాఫీస్ సెంటర్ ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ డిపో నుంచి రైల్వేస్టేషన్ వరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో 2030వ సంవత్సరం నాటికి మలేరియాను నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ప్లాస్మోడియా పరాన్న జీవి ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం వస్తుందన్నారు. కనీసం వారానికి ఒకసారి నిల్వ ఉన్న నీరుని పారబోయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుకృత, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ మధువరుణ్, డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్, సిబ్బంది హరికిషన్, రామ్‌ప్రసాద్ , చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలక వర్గంలో ఉద్యమకారులకు

అవకాశం ఇవ్వాలి

ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ నర్సయ్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): దేవస్థానాల పాలకవర్గంలో తెలంగాణ ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం తెలంగాణ రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావనబోయిన నర్సయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవస్థానాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం అభినందనీయమన్నారు.

చిన్నారి వైద్యానికి టీఎన్ఆర్ ట్రస్ట్ సాయం

చుంచుపల్లి, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): వేడి నీటిలో పడి తీవ్ర గాయాలపాలై ప్రాణపాయ స్థితిలో ఉన్న చిన్నారి వైద్యానికి పాల్వంచ పట్టణానికి చెందని టీఎన్ఆర్ ట్రస్ట్ అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కళ్యాణిపాసి, సబియా నాజ్‌ల దంపతుల నాలుగేళ్ల కుమార్తె క్రితిక స్నానానికి తోడి ఉంచిన వేడి నీళ్ల బకెట్‌లో పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. పాపకు చికిత్స కోసం రూ.5 లక్షలు ఖర్చు అవగా, వీరికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాప త్వరగా కోలుకోవాలని ట్రస్ట్ అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

ఆలయాలకు శఠగోపం


6ఏ లోకి చేర్చిన గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం

- ఆదాయం ఉన్న దేవాలయాల వర్గీకరణ
- లక్షల్లో హుండీ నిండితేనే ప్రభుత్వ గుర్తింపు
- రాబడి లేని గ్రామాల్లోని ఆలయాలపై పట్టింపులేనితనం
- కనీసం సేవలు, పర్యవేక్షణ కూడా నిల్
- గ్రామస్థులు, దాతలపైనే భారం

భగవంతుడికి, భక్తునికి మధ్యలోకి వస్తున్న దేవాదాయ శాఖ పలు నిర్ణయాలతో వివాదాస్పదమవుతోంది. ఆలయాల నుంచి వస్తున్న ఆదాయంపై కన్నేసి, వాటితోనే అధికారులను నియమించి డబ్బులు దండుకుంటోంది. భక్తులకు సేవలు, సౌకర్యాలు కల్పించడంలో మాత్రం వెనకంజ వేస్తోంది. ప్రత్యేక వేడుకలు, పండుగల సందర్భంగా కూడా మెజార్టీ ఆలయాలకు ఒక్క పైసా కూడా విదల్చడం లేదు. గ్రామాల్లోని దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ స్థానికుల దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడి జరుగుతున్నాయి. ఖమ్మం నగరంలోని కొన్ని ప్రముఖ ఆలయాలలో కొంత మంది అర్చకులు, ఆలయ అధికారుల తీరుతో భక్తులు ఆలయాలకు వెళ్లాలంటేనే బయపడుతున్నారు. వారి సొంత ఆలయాలుగా భావించి భక్తులను చిన్నచూపు చూస్తున్నారని, దర్శన సమయాలలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది ఆలయ అధికారులు అభివృద్ధి పనుల పేరుతో దాతల వద్ద అధికంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని , లెక్కలు చూపటంలో మాత్రం భారీ తేడాలు ఉన్నాయనే విమర్శలు వినపడుతున్నాయి.

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మొత్తం 450 ఆదాయం లేని ఆలయాలు ఉన్నాయి. 88ఆదాయం ఉన్న ఆలయాలు ఉన్నాయి. ఆదాయం ఉన్న దేవాలయాలను మూడు విభాగాలుగా విభజించి వాటిలో 88 ఆలయాలను చేర్చారు. దేవాలయాలలో ఖమ్మం జిల్లాలో 6ఏ కింద 13, 6బీ కింద 32, 6 సీకింద 20 దేవాలయాలు మొత్తం 65 దేవాలయాలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6ఏ కింద 4, 6బీ కింద 14, 6 సీ కింద ఐదు మొత్తం 23 దేవాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 6ఏ పరిధిలో 17, 6బీ పరిధిలో 45, 6సీ పరిధిలో 25 మొత్తం 88 దేవాలయాలు ఉన్నాయి. 6ఏ కింద రూ.25లక్షల పైన ఆదాయం ఉన్న ఆలయాలు, 6బీ కింద 2 లక్షల నుంచి 25లక్షలు మధ్య, 6సీలో రూ. 2లక్షల కు దిగువ ఆదాయం ఉన్న ఆలయాలను చేర్చారు.

ఆదాయం ఉన్న వాటిపైనే శ్రద్ధ..

ఉమ్మడి జిల్లాలో ఆదాయం వస్తున్న 88 దేవాలయాలలోనే ఎండోమెంట్ నుంచి అధికారులు, సిబ్బంది సేవలు, పర్యవేక్షణ ఉటాయి. వాటిలోనే ఎండోమెంట్ తరఫున 5గురు మేనేజర్లు, 12మంది ఈవోలు ఉన్నారు. ఆదాయం లేని 450ఆలయాలకు అర్చకుడు, గ్రామకమిటీలు తప్పితే ఎండోమెంట్ నుంచి ఎలాంటి సహాయం ఉండదు, కేవలం ధూపదీప నైవేద్యాల కింద నెలకు రూ.10వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. వాటి అభివృద్ధి గ్రామస్థులు, దాతల మీదనే ఆధారపడి ఉంటుంది. దేవాదాయ శాఖ నుంచి నయాపైసా రాదు.

సామాన్యుడికేది ప్రాధాన్యం?

ఆదాయం ఉన్న ఆలయాలలో సామాన్య భక్తులకు దేవుని దర్శనం కావాలంటే గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. కొంత మంది ధనికులకు, రాజకీయ నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు, అనుచర గణానికి మాత్రం దేవుని దర్శనం సెకన్లలో కల్పిస్తారు. ఈ సంస్కృతి ప్రతి ఆలయంలో ఉండటంతో సామాన్య భక్తులు ఆలయాలకు రావాలంటే భయపడుతున్నారు. ప్రత్యేక సందర్భాలలో శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, దసర, బ్రహ్మోత్సవాలు, ఇతర పండుగల రోజులలో సామాన్య భక్తులకు దేవుని దర్శనం గంటల కొద్దీ పడుతోంది.

పెద్ద ఆలయాలు ఇవే..

దేవాదాయ శాఖ 6ఏ విభాగంలో ఉమ్మడి జిల్లాలో 17ఆలయాలను చేర్చింది. వాటిలో భద్రాచలం సీతారామఆలయం, పాల్వంచలోని పెద్దమ్మ తల్లి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని విఘ్నేశ్వరాలయం, ఖమ్మం రూరల్‌లోని రెడ్డిపల్లి మారెమ్మతల్లి ఆలయం, పెనుబల్లిలోని నీలాద్రీశ్వరాలయం, ఖమ్మంలోని స్తంభాద్రి ఆలయం, కమాన్ బజార్ వెంకటేశ్వరాలయం, కాల్వ ఒడ్డు సత్యనారాయణ ఆలయం, వేంసూరులోని కందుకరు వేంకటేశ్వరస్వామి ఆలయం ఈ జాబితాలో ఉన్నాయి. కొత్తగా ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర ఆలయం, మధిరలోని మృత్యుంజయ ఆలయం, ఖమ్మంలోని గుంటు మల్లేశ్వరస్వామి ఆలయం, ఏన్కూరులోని గార్లొడ్డు లక్ష్మీనర్సింహస్వామిఆలయం, సింగరేణి మండం ఉసిరికాయపల్లిలోని కోట మైసమ్మ ఆలయం, ఖమ్మం ఇందిరానగర్‌లోని వర్ధశాల ఆలయంను చేర్చారు.

గిరిజనుల హక్కుల కోసం పోరాడుదాం

- ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనరు ముక్తి సత్యం


ప్రసంగిస్తున్న ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనరు ముక్తి సత్యం

భద్రాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఉన్న హక్కుల అమలు కోసం గిరిజనులను ఐక్యం చేయడానికి ఆలిండియా గిరిజన ఫోరం కృషి చేస్తోందని ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనరు ముక్తి సత్యం అన్నారు. భద్రాచలంలో శుక్రవారం అఖిల భారత గిరిజన ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలో గిరిజనుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. బస్టాండు, అంబేడ్కర్ సెంటర్, ఐటీడీఏ రోడ్డు మీదుగా గిరిజన భవన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సత్యం మాట్లాడారు. గిరిజన సమూహాల మధ్య ఉన్న తేడాలను మిత్ర వైరుధ్యంగానే భావిస్తున్నామని, హిందుత్వవాదులు, కార్పొరేట్ కంపెనీ యజమానులతో కుమ్మక్కై ఖనిజాలు, సంపదను దోచుకుపోతున్నారన్నారు. ఎదురు తిరిగితే కగార్‌పేరుతో దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ రాష్ట్ర కన్వీనరు సుర్దపాక నాగేశ్వరరావు, ముర్రం వీరభద్రం, జీసన్ట్రు, వేట్ల శాంతన్ కుమార్‌రెడ్డి, మోకాళ్ల మురళీకృష్ణ, ఈసం కృష్ణ పాల్గొన్నారు.

అన్నదాత.. వరిగోస

- నేలకొండపల్లిలో దిగుమతి చేసుకోని మిల్లర్లు
- తమ టార్గెట్ పూర్తయిందంటూ వెనక్కి
- అధికారులు చెప్పినా వినిపించుకోని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

కూసుమంచి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టులో బోర్లు, బావుల కింద యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి., సన్నరకం, మొద్దురకం ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. కూసుమంచి మండలంలో ఐకేపీ ద్వారా సేకరించిన ధాన్యాన్ని నేలకొండపల్లి మండలంలోని మిల్లులకు కేటాయించగా మిల్లర్లు తిరస్కరిస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకపోవడంతో చేసేదిలేక మార్కెట్‌కు, మధ్య దళారులకు తెగనమ్ముకుంటున్నారు

జిల్లాలో సాగర్ ఆయకట్టుకింద, బోర్లు బావుల కింద, సుమారు 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. గత 20రోజులుగా రైతులు ముమ్మరంగా వరి కోతల్లో బిజీగా ఉన్నారు. ప్రభుత్వం సన్నరకాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఎక్కువగా సన్నాలు సాగుచేశారు. మరికొందరు మొద్దు రకం సాగుచేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లోనూ, మిల్లర్ల వద్ద సమస్యలు వస్తున్నాయి. కేంద్రాల్లో బస్తాల కొరత, హమాలీల కొరత వేధిస్తోంది. కూసుమంచి మండలంలో పాలేరు, కూసుమంచి, కిష్టాపురం, జక్కేపల్లి, జుజ్జులరావుపేట_ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సేకరించిన ధాన్యాన్ని నేలకొండపల్లి, కోదాడ మిల్లులకు కేటాయిస్తున్నారు. ఈక్రమంలో నేలకొండపల్లి మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. తమ టార్గెట్ పూర్తయిందని, ధాన్యాన్ని దింపుకోమంటూ వెనక్కి పంపిస్తూ కొర్రీలు పెడుతున్నారు. కొందరు తేమశాతం, తాలు, చెత్తపేరుతో ఐదు నుంచి ఆరుకిలోలు కోత విధిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఇంకా సగానికిపైగా ధాన్యం ఉండగానే మిల్లర్లు కొర్రీలు పెడుతుండటంతో మిగిలిన రైతులు తమ పరిస్థితి ఏంటోనని కొంత ఆందోళన చెందుతున్నారు.

అకాలవర్షాలతో ఆందోళన

యాసంగిలో రైతులు పెద్దఎత్తున వరిసాగుచేశారు. ఈక్రమంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్లపై, కొనుగోలుకేంద్రాల్లో నూర్పిడి చేసిన వరిని ఆరబెట్టారు. ఈక్రమంలో గత వారంరోజులుగా అకాలవర్షాలు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఇప్పటికే కోస్తుండగా, మరికొన్ని చోట్ల వరికోత మిషన్లకోసం ఎదురు చూస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం
తిర్మల్‌రావు, ఐకేపీ ఏపీఎం

యాసంగి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. మిల్లర్లనుంచి కొంత సమస్య వస్తున్నప్పటికీ వారికి నచ్చచెప్పి దింపుతున్నాం. బస్తాల కొరత రాకుండా ముందే ఇండెంట్ పెడుతు సమస్య అధిగమిస్తున్నాం. ఎండలు పెరగడంతో హమాలీలు కూడా కాంటాలు వేసేందుకు ఇబ్బంది అవుతోంది.


కూసుమంచిలోఆరబెట్టిన ధాన్యం

మిల్లర్లు లెక్క చేయడం లేదు: గణపారపు రవి, తుర్కగూడెం

యాసంగిలో 1001 ధాన్యాన్ని పండించా. కిష్టాపురం కొనుగోలు కేంద్రానికి తీసుకెళితే ధాన్యాన్ని వారు నేలకొండపల్లి మిల్లుకు తరలించారు. అక్కడ వారు రెండురోజులవుతున్న దింపుకోవడం లేదు. వెంటనే ఐకేపీ అధికారులకు తెలియపరిచినప్పటికీ పట్టించుకోలేదు. మిల్లర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పలువురు న్యాయాధికారులు బదిలీ

ఖమ్మంలీగల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పలువురు న్యాయాధికారులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఖమ్మం మద్యపాన అబ్కారి ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి కాళ్లబండి శాంతిలతను వికారాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. మధిర ఒకటోఅదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారిగా పనిచేస్తున్న టి.కార్తీక్‌రెడ్డిని, వనపర్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జిగా బదిలీ చేశారు. సత్తుపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఆయేషాను హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సత్తుపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బి.సాయి నాగ సుమబాల రానున్నారు. ఆమె మిర్యాలగూడ నుంచిబదిలీపై సత్తుపల్లి రానున్నారు. మధిర ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా వేముల దీప్తి రానున్నారు. ఆమె నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి రానున్నారు. హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఖమ్మం జిల్లా కోర్టులో ఉచిత వైద్యశిబిరం

ఖమ్మంలీగల్,ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి):శుక్రవారం ఉదయం బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ప్రారంభించారు. మలకపేట యశోద ఆసుపత్రి వారు పరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు ఎం.కల్పన, కానరగడ్డ దీప, బిక్కం రజని, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షురాలు మోత్కూరి విజయశాంతి తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకున్న రాజగోపాల్

ధాన్యం రైతులను ఇబ్బందిపెడితే

పోలీసులకు ఫిర్యాదు చేయండి

- ధాన్యం కొనుగోలుదారులను ఇబ్బంది పెడితే ఫిర్యాదు చేయండి
- సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి, ఏప్రిల్25)(ఆంధ్రజ్యోతి) ధాన్యం కొనుగోలుదారులు, మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి అమ్మకాల్లో ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే మిల్లర్లను ఉపేక్షించబోమన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతుల ఇబ్బందులను పరిగణలోని తీసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరచుగా తనిఖీ చేస్తుండాలని పోలీస్‌అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కానీ మిల్లుల వద్ద కానీ రైతులకు ఇబ్బందులు ఎదురైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అందరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. అనంతరం రాజేశ్వరపురం గ్రామంలోని అరుణాచల రైస్ మిల్లును సీపీ సునీల్‌దత్, తుంబూరు దయాకర్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నెల్లూరి భద్రయ్య, వేగినాటి లక్ష్మీనర్సయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్ఐ పెంటరిసంతోష్ ఉన్నారు.


రాజేశ్వరపురంలోని అరుణాచల రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న సీపీ

పేకాట ఆడుతున్న ఐదుగురి పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణంలోని కరకట్ట సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు లాడ్జిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని భద్రాచలం పట్టణ ఎస్సై జి.స్వర్ణ పట్టుకున్నారు. వారి నుంచి రూ.10,750 వేల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన వారిలో మద్యం వ్యాపారంలో కీలకంగా వ్యవహరించే ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



తల్లాడ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో వడదెబ్బకు గురై గురువారం రాత్రి వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బయ్యారపు దర్గయ్య(70)పశువులు మేపేందుకు పొలానికి వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన దర్గయ్యను చికిత్సకోసం 108 ద్వారా తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతిచెందాడు. దర్గయ్యకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు.

విద్యుత్ సిబ్బందికి విద్యుదాఘాతం

భద్రాచలం, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని జగదీష్‌కాలనీలో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ అమర్చే సమయంలో ఇద్దరు విద్యుత్తు శాఖ తాత్కాలిక సిబ్బంది శ్రీను, సాంబ విద్యుదాఘాతానికి గురయ్యారు. అప్రత్తమైన తోటి సిబ్బంది వారిని వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపారు.ఉమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి సరఫరా ఇస్తున్న సమయంలో సమీపంలో ఇళ్లల్లో ఇన్వెర్టర్ ఆన్ చేయడంతో రివర్స్ ఇండక్షన్ సప్లయ్ రావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నేలకొండపల్లి,ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. సింగారెడ్డిపాలెం పాత అరవిందా స్కూల్ వద్ద ఓ ద్విచక్రవాహనం రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్ నుబలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న గంగు సోమేశ్వర్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజేశ్వరపురం వైపు నుంచి నేలకొండపల్లి వైపు వెళుతున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేరస్తులను పట్టించిన బెయిల్ ప్రయత్నం

- నవభారతిలో దొంగతనం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ,ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ఒక నేరస్తుడికి బెయిల్ కోసం చేసిన ప్రయత్నం.. మరో ఇద్దరు నేరస్తులను పట్టించిన సంఘటన భద్రాద్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ ఏడాది జనవరి 25 అర్ధరాత్రి పాల్వంచ నవభారత్ కాలనీలో చోరీ జరిగింది. దీనిలో ప్రధాన సూత్రధారి అనీల్ గతనెల 25న పోలీసులకు పట్టుబడి జైలులో ఉన్నాడు. అతడి స్నేహితులు, సహనేరస్తులు బెయిల్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరూ కొత్తగూడెం వచ్చి ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసి పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు.. పాల్వంచ నవభారత్ కాలనీలో జనవరి 25 అర్ధరాత్రి తొమ్మిది క్వార్టర్లలో మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు దొంగలు సుమారు 900 గ్రాముల బంగారంతో పాటు నగదును అపహరించారు. ఈక్రమంలోనే గత నెల 21న నలుగురిలో ఒకరైన అనీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి మిగిలిన నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచి వారికోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రధాన నిందితుడు పింటూ బవార్‌తో పాటు చోరీ బంగారాన్ని కొనుగోలు చేసిన శోభన్‌సింగ్ సోలంకి జైలులో ఉన్న అనీల్ సింఘార్‌కు బెయిల్ కోసం ప్రయత్నిస్తూ కొత్తగూడెం చేరుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు కొత్తగూడెంలో వారిద్దరినీ అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 240 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండుసెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు.ఈ సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్, పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్, సీసీఎస్ ఎస్ఐ ప్రవీణ్, పాల్వంచ టౌన్ అడిషనల్ ఎస్ఐలు రాఘవయ్య, నీవన్‌రాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

ఇసుక డంపు స్వాధీనం

తిరుమలాయపాలెం, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాజీనగర్ పంచాయతీ శివారు రమణతండాలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శుక్రవారం రెవెన్యూ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఆకేరు నది రమణతండా వద్దనుంచి ఇసుక వ్యాపారులు అక్రమంగా సుమారు 50 ట్రిప్పుల ఇసుకను నిల్వ చేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎస్ఐ కూచిపుడి జగదీష్, తహసీల్దార్ జి.సుధీర్ ఎస్ఐ2 రామలింగారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.ఇసుకను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.



వైరాలో చైన్ స్నాచింగ్

- రూ.మూడులక్షల బంగారు గొలుసు చోరీ

వైరా,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): వైరాలోని సత్రంబజార్‌కు చెందిన ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వెనుకనుంచి వచ్చిన దొంగ లాక్కెళ్లాడు. మిట్టపల్లి వెంకటలక్ష్మీ అనే మహిళ శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి గాంధీచౌక్ వైపు వస్తోంది. ఈ సమయంలో హెల్మెట్ ధరించి ఉన్న ఒక ఆగంతకుడు ద్విచక్రవాహనంపై వెనుకనుంచి వచ్చి బలవంతంగా బంగారు గొలుసు తెంచుకొని పారిపోయాడు. సంఘటనాస్థలంలోనే ఉన్న అపార్టుమెంట్‌కు చెందిన వాచ్‌మెన్ ఆగంతకుడిని అటకాయించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పట్టపగలే జనసంచారం ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన కలవరపాటుకు గురిచేసింది. బాధితురాలు వెంకటలక్ష్మీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ సాగర్, కొణిజర్ల ఎస్ఐ సూరజ్ సంఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.


విచారణ జరుపుతున్న ఏసీపీ, సీఐ

టీ స్టాల్ కూల్చివేత

రోడ్డును ఆక్రమించి నిర్మించటంతో చర్యలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన టీస్టాల్‌ను కేఎంసీ డీఆర్ఎఫ్ బలగాలు కూల్చి వేశాయి. రహదారి వెంట 35 అడుగుల రహదారిని ఆక్రమించి బాలాజీ టీస్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావటంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు టీ స్టాల్‌ను తొలగించారు.





పగిలిన మిషన్ భగీరథ పైపు



ఖమ్మంరూరల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి):ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో శుక్రవారం ప్రధాన రహదారి వెంబడి ఉన్న మిషన్ భగీరథ పైపు పగిలింది. దీంతో పెద్దఎత్తున నీరు వృథాగా పోతోంది. రైతులు జేసీబీతో పనులు చేయిస్తుండగా ప్రమాదవశాత్తు పైపులైన్‌కు తగలడంతో ఈ ఘటన జరిగింది. మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందించగా వారు మరమ్మతులు చేయించారు.

యువతికి ప్రాణం పోసిన
సర్కారు ఆస్పత్రి వైద్యులు

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓ16ఏళ్ల యువతిని ప్రాణాపాయ స్థితి నుంచి సర్కారు వైద్యులు కాపాడారు. పురుగుమందు తాగి తీవ్రమైన సైనోసిస్‌తో మంగళవారం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు ఆ యువతికి కార్డియాక్ అరెస్ట్ కావడంతో ఐసీయూలో ఉంచి సీపీఆర్ చేశారు. ఇంట్యూబేషన్‌తో తిరిగి ప్రాణం పోశారు. ప్రస్తుతం ఆ యువతి చరిత నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రానికి కోలుకుంది. ఫిజీషియన్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ వినోద్ ఆ యువతిని నాలుగు రోజులుగా పరీక్షలు నిర్వహించడంతో పూర్తిగా కోలుకుంది. దీంతో ఆమెను శుక్రవారం సాయంత్రం ఇంటికి పంపించారు. ఆమెకు వైద్యచికిత్సలు అందించిన వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు బి.రాంబాబు, వినాయక్‌రాథోడ్ అభినందించారు. వైద్యులను నర్సింగ్ సిబ్బంది యూ రవికుమార్, ఎం పవన్‌కుమార్, ఆర్ రవీంద్రనాయక్, ఎస్.అనూషను యువతి కుటుంబ సభ్యులు అభినందించారు.



కేఎంసీకి సిఫారసుల గోల

- త్వరలో 19 నూతన వాహనాలకు డ్రైవర్ల అవసరం
- దొడ్డిదారిన ఇటీవల నలుగురి నియామకం
- నోటిఫికేషన్‌తో నియామకాలు చేపట్టాలంటున్న నిరుద్యోగులు



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులకు డ్రైవర్ల నియామకం తలనొప్పిగా మారింది. సిఫారసుల తాకిడికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా ఖమ్మం నగర పాలక సంస్థ సొంతంగా వాహనాలను సమకూర్చుకుంటోంది. వాటికి నూతన డ్రైవర్లు ఆవశ్యకత ఏర్పడింది.ఈ క్రమంలో కార్పొరేటర్లు, కేఎంసీ కార్యాలయంతో పాటుగా పారిశుధ్య విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వారి బంధువులను డ్రైవర్లుగా పెట్టించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.నిత్యం పదుల సంఖ్యలో కేఎంసీ కార్యాలయానికి సిఫారసు లేఖలు వస్తున్నాయి.

చర్చనీయాంశంగా మారిన నలుగురు డ్రైవర్ల నియామకం

మున్నేరు వరదల సమయంతో పాటుగా అత్యవసర సమయంలో, అవసరాల మేరకు బయట నుంచి డ్రైవర్లను నగర పాలక సంస్థకు వినియోగించారు. వీరికి రోజువారి వేతనం చెల్లించారు.అయితే పనిచేసిన రోజులకు అధికారులు డబ్బులు చెల్లించి వారిని పంపకుండా కేఎంసీ కార్యాలయంలో నెలల తరబడి అనాధికారికంగా విధులు అప్పగించారు. అదిగో ఉద్యోగం.. ఇదిగో ఉద్యోగం అంటూ కొంతమంది డ్రైవర్లుకు ఆశల కల్పించారు. ఈ క్రమంలోనే తాజాగా నలుగురు డ్రైవర్లు నియామకం చర్చనీయాంశంగా మారింది. కేఎంసీ అధికారి వద్ద పనిచేసే డ్రైవర్ తమ్ముడు, ఓ ప్రముఖ కార్పొరేటర్ సిఫారసు మేరకు ఒక డ్రైవర్, మాజీ ఏఎంసీ సిఫారసు మేరకు ఒక డ్రైవర్, మంచుకొండ ప్రాంతం నుంచి మరో డ్రైవర్‌ను ఇటీవల కాలంలో కేఎంసీలో డ్రైవర్లుగా ఆమోదముద్ర వేశారు. వీరికి వేతనాలు చెల్లింపులో సమన్వయం లేక వెలుగులోకి వచ్చింది.రంగం సిద్ధం చేయటం వెలుగులోకి వచ్చింది. ఏ నిబంధనల మేరకు డ్రైవర్లుగా నియామకం చేశారనే కేఎంసీలో చర్చ జరుగుతోంది. దీని వెనుక డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నోటిఫికేషన్‌పై అనుమానాలు

సిఫారుల నేపథ్యంలో కేఎంసీపై నియామక ఆరోపణలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. తాజాగా నలుగురు చేరటంతో ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. మరికొందరు చేరేందుకు రంగం సిద్ధమైంది. ఖమ్మం నగర పాలక సంస్థ సొంతంగా పారిశుధ్యవాహనాలను కొనుగోలు చేశారు. కొన్ని సాంకేతికపరమైన అరిఅంశాలతో వాహనాలు కేఎంసీ కార్యాలయానికి ఇంకా చేరలేదు. ఇలా వచ్చిన వాహనాలకు 19మందికి పైగా డ్రైవర్లు అవసరం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధికారికంగా ప్రభుత్వ నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల మేరకు నియామకాలు జరపాలని ప్రజలు కోరుతున్నారు.

హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్‌లో వేసవి శిక్షణ ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పార్వతిరెడ్డి

ఖమ్మంరూరల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని కరుణగిరి ప్రాంతంలోని హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి, కరస్పాండెంట్ పి.రవిమారుతి శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వివిధ రకాల ఆటపాటలతో కూడిన విభిన్న అంశాలతో చక్కటి కరిక్యూలమ్ ఏర్పాటు చేశామన్నారు. చదరంగం,ఆర్ట్, క్రాఫ్ట్, చిత్రలేఖనంలో మెలకువలు, దస్తూరిని మెరుగు పరిచేందుకు క్యాలీగ్రఫీలో తర్ఫీదు, నృత్యంతో శిక్షణను, సంగీతంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ప్రీతి, వి.చందన, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సెమీరెసిడెన్షియల్‌గా మార్చాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి విజయ్, మాజీ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, ఉపాధ్యాయురాలు పద్మలు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అభిస్తుందనే నమ్మకం కలిగేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యా రంగంలో ప్రైవేటీకరణను నియంత్రించాలని, ప్రతి గ్రామంలో ఒకే బడి అదీ ప్రభుత్వ పాఠశాల ఉండేలా కామన్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ నాటికి కాల్వల పనులు పూర్తవ్వాలి

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- రూ.42.10కోట్లతో వైరా కాల్వల ఆధునీకరణ

వైరా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ లోగా వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రూ.42.10కోట్లతో చేపట్టిన రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులను తాటిపూడి వద్ద కుడికాల్వలో శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ రెండునెలల కాలంలోనే పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాణ్యతాప్రమాణాలతో ఈ పనులు చేపట్టాలన్నారు. సమయం తక్కువ ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పనులను పూర్తిచేసి రైతులను మెప్పించాలని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కనీసం పిడికెడు మట్టి కూడా కాల్వల్లో వేయలేదని ఆక్షేపించారు. ఎక్స్‌కవేటర్ నడిపి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు తాతా నిర్మల, జవ్వాజి నాగరాజు, నర్వనేని అశోక్ పాల్గొన్నారు.

ప్రారంభమైన వీరన్నస్వామి జాతర



నేలకొండపల్లి, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూటాపురం గ్రామ ప్రజలతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆరాధ్య దైవమైన శ్రీవీరన్నస్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. రెండు సంవత్సరాలకు ఒకసారి వీరన్నస్వామి జాతరను నిర్వహిస్తారు. ఈ జాతరను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. తొలిరోజు శుక్రవారం వీరన్నస్వామిని పెళ్లి కుమారునిగా చేసి గ్రామంలోని ఊరేగించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చివరిరోజైన ఆదివారం గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మొక్కులు తీర్చుకోవటంతో జాతర ముగుస్తుంది. కార్యక్రమంలో తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చావా కోటయ్య, గుడిమళ్ళ మధు, బొల్లినేని వెంకన్న, చావా రమేష్, చావా వీరశేఖర్‌రావు, ఏలూరి శ్రీనివాసరావు, కట్టా రాజేష్, బెల్లం వాసు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



నేలకొండపల్లి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం జరిగింది. జొన్నాభట్ల ప్రసాదశాస్త్రి, జొన్నాభట్ల నాగయ్యశాస్త్రి ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుడి నిర్మాణం కోసం స్థలాన్ని వితరణ చేసిన మండల విద్యాధికారి బాలిన చలపతిరావు దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతిష్ఠ మహోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మరికంటి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ కనకబండి సీతరాములు,యాదవ సంఘం నాయకుడు మల్లెబోయిన శ్రీనివాసరావు, బాలిన నారాయణ, నూకనాగయ్య యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ చైతన్యోత్సవ్ 2025



జ్యోతి ప్రజ్వల చేస్తున్న జేడీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం శ్రీ చైతన్యోత్సవ్ 2025 కల్చర్ ఆఫ్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ,సింగర్ కృష్ణతేజ, విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక హాజరై జ్యోతి ప్రజ్వల చేసి మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో మంచిని గ్రహించి, చెడును వదిలేయాలని, ఉత్తమ పౌరులుగా నిలవాలని, భవిష్యత్తుకు మార్గనిర్దేశం కావాలని అన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. నిత్యం పుస్తకపఠనం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు సమాజం పట్ల, విద్యపట్ల బాధ్యతగా ఉండాలని, నూతన ఆవిష్కరణలు మరింత బాధ్యతగా సమాజానికి ఉపయోగపడేలా తీసుకురావాలని అన్నారు. అనంతరం కృష్ణ చైతన్య పాటలు, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, రావులేజ్, పన్నాల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ఆరోహణ్ టెక్నికల్ ఫెస్ట్



జ్యోతిప్రజ్వల చేస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి ఆరోహణ్ టెక్నికల్ సింపోజియం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కెఎమ్. లక్షణరావు, టెక్ స్కై. సీఈఓ. బత్తినేని. స్వాతి, టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య, కళాశాల చైర్మన్ గుండాల. కృష్ణ హాజరయ్యారు. ప్రస్తుత సమాజంలో కృత్రిమ మేథస్సు అన్ని రంగాలలో చొచ్చుకు పోతుందని, ఏఐపై విద్యార్థులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కళాశాల విద్యార్థుల తోపాటు, జిల్లాలోని 69 మంది పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్, స్లైడ్‌డెక్, కోడింగ్ క్లబ్, టెక్నికల్ క్విజ్ తోపాటు ట్రెజర్ హంట్ తదితర పోటీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి. ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, శివప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- అనుమతి లేకుంటే చర్యలు
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతిబాయి



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతిబాయి అన్నారు. శుక్రవారం సాధారణ తనిఖీలలో భాగంగా డిప్యూటీడీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, డాక్టర్ వెంకటరమణతో కలసి సురక్ష ఆసుపత్రిని తనిఖీలు చేశారు. ముందుగా ఓ.పీ. ఐపీని పరిశీలించారు. రోగుల నుంచి వసూలు చేసే ఫీజులు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించారు. రోగులకు అందించిన సేవలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్నివిభాగాలు, రిజిస్టర్లు, ల్యాబ్, పద్ధతి ప్రకారం నిర్వహించాలని లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి అమానుషం

మద్దినేని స్వర్ణకుమారి



కూసుమంచి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడిచేసి 27మందిని హత్య చేయటం అమానవీయమని రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి ఖండించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు చాలా దురదృష్టకరమని ఆవేదన చెందారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఖమ్మంరూరల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపుమేరకు చలో హైదరాబాద్ ధర్నాకు వెళుతున్న సందర్భంగా రాత్రిసమయంలో పంచాయతీ వర్కర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటాన్ని సీఐటీయూ శుక్రవారం ఖండించింది. సమస్యలు పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సైదులు, భిక్షం, ధనమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాస్తు హోమం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీశాస్తా దేవస్థానం అయ్యప్ప స్వామి దేవాలయ 39వ బ్రహ్మోత్సవాలు భాగంగా శుక్రవారం వాస్తు హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఆచార్యపరణం, స్థల శుద్ధి, వాస్తు బలి, రక్షోఘ్నహోమం, అంకురార్పణ, అత్తాళపూజ, హరివరాసనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ చైర్మన్ చిల్లంచర్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాయపూడి. వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి. రంగారావు తెలిపారు. ఈ పూజలు ఆలయ తంత్రి టికె దామోదరన్ బృందం, ఆలయ ప్రధాన పూజారి పాతికల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల20 నుంచి ప్రారంభమైన సార్వత్రిక పది, ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు. శనివారం నుంచి మేనె వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నయబజార్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పదోతరగతి ఉదయం పరీక్షకు మొత్తం 16మందికి 14మంది హాజరయ్యారు. సాయంత్రం పరీక్షకు మొత్తం251 మందికి 222 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ఉదయం పరీక్షకు మొత్తం 617 మందికి 543మంది హాజరయ్యారు. సాయంత్రం పరీక్షకు 59మందికి 47 మంది హాజరయ్యారు.

40 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 1984-85 విద్యాసంవత్సరంలో టీటీసీలుగా శిక్షణ తీసుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 40ఏళ్ల అనంతరం కలుసుకోవటంతో నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ప్రస్తుత కుటుంబ నేపథ్యం మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నాగిరెడ్డి, శ్యామ్‌బాబు, రవీందర్‌రెడ్డి, ఉష, నెహ్రూ, సీతరామారావు, విమల, భారతి, లిల్లీ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు వెళ్లి వస్తూ మృతి

కామేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి చెందారు. ఈసంఘటన కామేపల్లి మండలం ముచ్చర్ల సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. జాస్తిపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ దేవండ్ల యాదగిరి(55) ఉపాధి హామీ పని చేసి తిరిగి తనబైక్‌పై వస్తున్నాడు. మద్దులపల్లి గ్రామానికి చెందిన రెల్లా గోపాల్‌రెడ్డి తన బైక్‌తో ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. కిందపడిన యాదగిరికి తల వెనక తీవ్రమైన గాయం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బీఆర్ఎస్ రజతోత్సవానికి తరలి రావాలి

తాతా మధు, కందాళ, సండ్ర



రాజుపేటలో మాట్లాడుతున్న తాతా మధు

కూసుమంచి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, పాలేరు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు శుక్రవారం కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంగలితండా, ఈశ్వరమాధారం, రాజుపేట బజార్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ నినాదం ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రపంచ నలుమూలల దాటిచెప్పి దేశ పాలకును మెప్పించి ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ రజతోత్సవ పండుగలకు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు.

కామేపల్లి: వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవానికి భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి అచ్చయ్య, వడియాల క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. జాస్తిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం తిరిగి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 15నెలలలోనే ప్రజాపాలనపై వ్యతిరేకత మొదలైందని అన్నారు. హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈసమావేశంలో నాయకులు మూడ్ క్రిష్ణప్రసాద్, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామా మోహన్‌రెడ్డి, భట్టు శంకర్, తూము బాబు, జీ.సత్యనారాయణ, పి. రాంమూర్తి, శెట్టి సంతోష్‌రావు, కన్నమాల రాంబాబు, అజ్మీరా రాజు, ప్రసాద్, మూడ్ శ్రీను, భగవాన్, అనంతరాములు తదితరులు ఉన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక చేయూత

కల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం ఐఐటీ కాన్పూర్‌లో సీటు సాధించిన కల్లూరు ప్రాంతానికి చెందిన విద్యార్థి తేజావత్ శ్రీనివాస్ తల్లిదండ్రులకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్ఫూర్తిఫౌండేషన్ తరుపున రూ. 50 వేల చెక్కును అందజేశారు. శ్రీనివాస్ చదువులో ప్రతిభ కనబరిచనందుకు గాను ఉన్నత విద్యలో రాణించేలా ఫౌండేషన్ తరుపున మొదటి విడతగా రూ.50 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ సేవలను గుర్తించిన కలెక్టర్ సంస్థ చైర్మన్ శ్రీవ్యాల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో రాజశేఖర్, ఫౌండేషన్ ప్రతినిధి వి. రామారావు, ఉబ్బన బాబురావు, రామకృష్ణ, బైర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'విజయ'లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కొణిజర్ల ,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): విజయ ఇంజనీరింగ్ కళాశాల లో శుక్రవారం ఎక్సెల్‌ఆర్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) అధ్వర్యంలో ఆన్‌క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను కళాశాలలో నాలుగవ సంవత్సరం చుదువుతున్న వివిధ కోర్సుల విద్యార్థులకు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో కళాశాలలోని 150 మంది విద్యార్థులు పాల్గొనగా 30 మంది విద్యార్థులు ఆ కంపెనీలో ఉద్యోగ అర్హత సాధించారు. కళాశాలలో రిక్రూట్మెంట్ ఏర్పాటు చేయడం పట్ల కళాశాల యాజమన్యాం ఎక్సెల్‌ఆర్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపింది. కంపెనీ ప్రతినిధులు అవినాష్ శిల్పా డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఆయేషాతరుణం, డీన్ శ్రీనివాసరావు, ఏవో ఫరీదాబాబా తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి' పై నేడు అవగాహన

కొణిజర్ల, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం గురించి కొణిజర్ల శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో రైతులకు శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాము శుక్రవారం తెలిపారు. సదస్సుకు కలెక్టర్, ఉన్నతాధికారులు హాజరవుతున్నారని రైతులు హాజరై చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

'మేడేనాడు అరుణపతాకాలు ఎగరాలి'

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా 1వ తేదీన వీధివీధిన అరుణపతాకాలు ఎగరాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌లను పట్టణంలో ఆవిష్కరించారు. హక్కులను కాపాడుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా మేడే విస్మృతస్థాయిలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, వాసం శ్రీను, బట్ట వెంకన్న, కొత్తపల్లి అంజన్‌రావు, కృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్య రికార్డుల తనిఖీ

కల్లూరు, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహణకు సంబంధించిన రికార్డులను కేసీకేఆర్ కంపెనీ ప్రతినిధులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సమాఖ్యలలో ఉన్న లావాదేవీల రికార్డులను, నగదు తీర్మానం, రుణ తీర్మానంకు సంబంధించి 11 రకాల రికార్డులను వారు పరిశీలించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 వరకు బహిర్గత తనిఖీలు నిర్వహించారు. ప్రతినిధులు రామవరెడ్డి, గంగాధర్, జనార్ధన్ పాల్గొన్నారు.



ఎడ్లబంజర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న సండ్ర



సత్తుపల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన



కల్లూరులో నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన

దేశరక్షణ కోసం అందరూ ఏకం కావాలి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- ఉగ్రదాడికి వ్యతిరేకంగా మండల కేంద్రాల్లో ప్రదర్శనలు

పెనుబల్లి/ కారేపల్లి/ సత్తుపల్లి / కల్లూరు/ మధిర రూరల్/ వైరా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ దేశం తీసుకునే నిర్ణయానికి అందరూ మద్దతునివ్వాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. శుక్రవారం మండలంలోని ఎడ్లబంజర్‌లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకి శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావ్, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, వినీల్, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇస్లాంలో హింసకు తావులేదు.. ఇస్లాం అంటేనే శాంతి అని.. హింసకు తావులేదని జామే మసీద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే నాయబ్‌రసూల్, ఎండీ కమల్‌పాషా అన్నారు. కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల మరణకాండను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం సత్తుపల్లి పట్టణంతోపాటు మండలంలోని మసీదుల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దోషులు ఎవరైనా ఏ మతస్థులైనా తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు ఎండీ రియాజుద్దీన్, మౌలాలీ, ఎస్‌కే.వాహిద్, యూసఫ్, ఖలీల్, సలీం పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి.. కశ్మీర్‌లో టూరిస్టులపై కాల్పులు జరిపి 28మందిని పొట్టనపెట్టుకున్న దుండగులను కేంద్రప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకురాలు పప్పుల నిర్మల, భూక్య చాందిని కోరారు. శుక్రవారం కారేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ టూరిస్టులపై కాల్పులుజరిపి అమాయకులను దారుణంగా హత్య చేశారని అన్నారు.

సీపీఎం ప్రదర్శన... పెహల్గామ్ ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మతోన్మాదం, ఉగ్రవాదం నశించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పెనుబల్లి మండలంలోని వీఎంబంజర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఉగ్రదాడిపై ముస్లింల నిరసన.. జమ్మూ కాశ్మీరులో ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా కల్లూరులో శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. జామే మసీద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం మండల ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులను తుద ముట్టించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు ముక్తకంఠంతో కోరారు. ఈ సందర్భంగా మసీదు ప్రాంగణంలో ఉగ్రదాడి నశించాలని పెద్దఎత్తున వారు నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం సదరు సయ్యద్‌అలీ, మసీద్ సదరు హనీఫ్, ముస్లిం నాయకులు ఎస్కే కమ్లి, ఎస్కే యాఖుబ్‌అలీ పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడులకు ఖండన.. ముస్లిం ఐక్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో మండంలోని దెందుకూరు గ్రామలోని మసీదు వద్దకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.



పెనుబల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



వైరాలో ఉగ్రవాద వ్యతిరేక ప్రదర్శన

ఖరీఫ్ నాటికి కాల్వల పనులు పూర్తవ్వాలి

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- రూ.42.10కోట్లతో వైరా కాల్వల ఆధునీకరణ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ లోగా వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రూ.42.10కోట్లతో చేపట్టిన రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులను తాటిపూడి వద్ద కుడికాల్వలో శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ రెండునెలల కాలంలోనే పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాణ్యతాప్రమాణాలతో ఈ పనులు చేపట్టాలన్నారు. సమయం తక్కువ ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పనులను పూర్తిచేసి రైతులను మెప్పించాలని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కనీసం పిడికెడు మట్టి కూడా కాల్వల్లో వేయలేదని ఆక్షేపించారు. ఎక్స్‌కవేటర్ నడిపి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు తాతా నిర్మల, జవ్వాజి నాగరాజు, సర్వనేని అశోక్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, యన్నం వెంకటకోటారెడ్డి, గుత్తా రామారావు, రఫీ, చింతనిప్పు మాధవరావు, జయరావు, ఐటీ ఈఈ బాబూరావు, డీఈఈ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు చుట్టం భూ భారతి చట్టం

రైతులకు చుట్టం భూభారతి చట్టమని, భూముల భద్రత కోసమే ఈ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో శుక్రవారం తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంలోని పెద్దలు తమ కుటుంబసభ్యుల ప్రయోజనాల కోసమే ధరణిని తీసుకువచ్చారని, అందుకే ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని బంగాళాఖాతంలో కలిపేసిందని స్పష్టం చేశారు. రైతుల భూములకు భూ భారతి చట్టం భద్రతనిస్తుందని స్పష్టం చేశారు.

రైతుల భూములకు పూర్తి రక్షణ

ఏన్కూరు, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా రైతుల భూములకు పూర్తి రక్షణ కలిపిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు: శుక్రవారం కమ్మవారి కలాణ మండపంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈసదర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతలో గిరిజన, గిరిజనేత రైతుల భూములకు కూడా పూర్తి రక్షణ కల్పిస్తామని అన్నారు. గిరిజన, గిరిజనేతరుల వివాదాలకు పోకుండా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో రాజేందర్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీ కరుణశ్రీ, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఏవో నరసింహారావు, ఎంపీడీవో సతినాల రమేష్, డీటీ కిరణ్ పాల్గొన్నారు.

'డ్రైడే ఫ్రైడే' పాటించాలి

కొణిజర్ల, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం, మంగళవారం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడేని పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలకేంద్రం కొణిజర్లలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలను పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలు కూడ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు.

బీఆర్ఎస్ సభకు భారీగా తరలాలి

మధిరరూరల్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వతేదీన వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవ బహిరంగసభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. శుక్రవారం మధిరలో బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బోనకల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బోనకల్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు తహసీల్దార్ పున్నం చందర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాప్యం లేకుండా చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, నాయకుడు బధ్రునాయక్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్
- ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



మహిళలకు కుట్టుమిషన్లను అందజేస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా బలపడాలని కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్ చెప్పారు. శుక్రవారం కల్లూరులో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ సంస్థ తరుపున పలువురు మహిళలకు ఆర్డీవో చేతుల మీదగా ఉచితంగా కుట్టుమిషన్లతోపాటుగా శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కుటుంబంలో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారో ఆయా కుటుంబాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. నిరుపేదలైన మహిళలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఆరు నెలలు పాటుగా ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వటం పట్ల సీడీఏ సంస్థ సేవలకు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా సీడీఏ సంస్థ అధినేతలు పి ఏనోష్‌కుమార్, చంద్రలీల దంపతులను ఆయన అభినందించారు. సీడీఏ అధినేత పి. ఏనోష్‌కుమార్ మాట్లాడుతూ సీడీఏ ద్వారా పేద విద్యార్థులకు విద్యతో పాటుగా గ్రామాల్లో తాగునీటి వసతి కోసం బోర్లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అనాథ పిల్లలకు తమ సంస్థ తరుపున ఆశ్రయం కల్పించామని చెప్పారు. ఈ సంస్థ తరుపున ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌ల వారిగా 100 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఉచితంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీఏ నిర్వాహకులు పి. చంద్రలీల, కాటేపల్లి రజనీకాంత్, కాటేపల్లి కిరణ్, ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్నాశి బాలరాజు, మీడియాసెల్ అధ్యక్షుడు దాసరి డేవిడ్‌రాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే సండ్ర



మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం తల్లాడలో బీఆర్స్ జెండాను ఆవిష్కరించారు ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగినసభలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరివల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. గన్నీ సంచుల సరఫరా, రైస్‌మిల్లుల కేటాయింపులో జాప్యం వల్ల వారాల తరబడి కొనుగోలు కేంద్రాల్లోని కల్లాల్లో ధాన్యంతో రైతులు వేచిచూడలేక విసుగు చెంది తమ ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సమయంలో కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. అన్నివర్గాలకు అండ బీఆర్ఎస్ జెండా అని 2నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండునిమిషాలు మౌనం పాటించారు ఈకార్యక్రమలో పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు కేతినేని చలపతిరావు, వజ్రాలరామిరెడ్డి, జీవీఆర్, షేక్ యూనుస్, గుండ్ల వెంకటి, నల్లగొండ శేషయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాందాస్‌నాయక్, దుర్గాప్రసాద్

బాధిత కుటుంబాలకు సానుభూతి

వైరా, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఏడోవార్డు బ్రాహ్మణపల్లిలో శుక్రవారం ఇద్దరు మృతిచెందగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు. వడదెబ్బతో మృతిచెందిన గొర్రెముచ్చు స్వామి భౌతికకాయానికి వారు నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అతర్వాత సీపీఐ మండల, పట్టణ మాజీ కార్యదర్శి చావా కుమార్ భౌతికాయానికి కూడా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నివాళులర్పించారు. కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

తోపుడు బండి వితరణ

వైరా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మి దంపతుల కుమార్తె అక్షరసిరి జన్మదినాన్ని పురస్కరించుకొని చిరు వ్యాపారి రాధకు నాలుగుచక్రాల తోపుడు బండిని వితరణగా అందజేశారు. శుక్రవారం వైరాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ తోపుడుబండిని రాధకు అందజేశారు. తమ కుమార్తె అక్షరసిరి జన్మదినం సందర్భంగా తోపుడుబండిని అందించిన శ్యాంబాబు, వరలక్ష్మి దంపతులను ఆయన అభినందించారు. లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, కిషన్, రామ్‌గోపాల్, మహాలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణం అడ్డగింత

వైరా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామానికి సమీపంలో వైరా కుడికాల్వపై చేపట్టిన ఇరుకు అండర్‌పాస్ వంతెన నిర్మాణాన్ని శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా రైతుల పంటపొలాల రహదారుల దగ్గర, పంటకాల్వల వద్ద నిర్మాణం చేస్తున్న అండర్‌పాస్ వంతెనలు, సైడ్ వంతెనలు కనీసం రైతులకు అవసరమైన వాహనాల రాకపోకలకు అనువుగా లేకుండా ఉండటంతో రైతులు నిరసన వ్యక్తం చేసి పనులు నిలిపివేశారు. కేవలం 8అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్న అండర్‌పాస్ నిర్మాణాన్ని అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మద్దతు తెలిపారు. రైతులతో కలిసి అండర్‌పాస్, సైడ్ బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలించారు. భవిష్యత్‌లో రైతుల పంట ఉత్పత్తులు తీసుకురావడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్, సైడ్ వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్కడున్న సంబంధిత గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బందితో మాట్లాడారు. ఈ సమస్యను తమ పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమస్యపై వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. రైతులు జాలాది గోపాలరావు, గొల్లపూడి హరినాథ్‌బాబు, హరి వెంకటేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరావు, మాడపాటి మల్లికార్జున్, గొల్లపూడి రాంబాబు, భద్రు, ఉరిశెట్టి కృష్ణ, రెడ్డి పాల్గొన్నారు.



ఇరుకు అండర్‌పాస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



కొణిజర్లలో ఆందోళన చేస్తున్న రైతులు



తల్లాడలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

- తల్లాడ, కొణిజర్లలో రైతుల ఆగ్రహం
- అధికారుల నిలదీత

తల్లాడ/ కొణిజర్ల, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని మల్సూర్ తండా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నెలరోజులుగా ఆరబోసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతుసంఘం ఆధ్వర్యంలో తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈసందర్భంగా రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లడుతూ రైతులు పండించిన సన్నరకాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయకుండా రైతులు మిల్లర్లతో మాట్లాడుకోమని బాధ్యతలేని సమాధానం చెబుతున్నారన్నారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ వెంటనే కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి నల్ల మోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయం ముందు ఆందోళన

కాంటాలు ఎందుకు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొణిజర్ల మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామరైతులు శుక్రవారం కొణిజర్ల ఐకేపీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. గ్రామంలో మూడు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు లారీలకు కూడ కాటాలు వేసి, ధాన్యాన్ని లోడు ఎత్తి వాటిని ముదిగొండ మండంలోని ఓ రైసుమిల్లుకు తరలించారు. మిల్లువద్ద మిల్లరు నాలుగు రోజుల నుంచి లారీలలోని ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోవడంతో గ్రామంలో అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారని, దిగుమతికి, ఇక్కడ కాటాలు వేసుకోవడానికి ఏమిటి సంబంధం అని రైతులు నిలదీస్తున్నారు. విషయాన్ని ఐకేపీ సీసీ సునీల్‌రెడ్డి సివిల్ సప్లయీస్ అధికారులకు తెలియజేసి, వారి ఆదేశం ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులు తెలపటంతో రైతులు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి

- మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

ఏన్కూరు, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనపట్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్‌పార్టీ వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అన్నారు. వరంగల్ సభ జనసమీకరణలో భాగంగా శుక్రవారం ఏన్కూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీజెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. వరంగల్‌సభకు భారీగా కార్యకర్తలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలన్నారు.